## క్లుప్తంగా

### పనులను సకాలంలో పూర్తి చేయాలి



**డిచ్‌పల్లి:** ప్రభుత్వ బడుల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన అభివృద్ధి, మరమ్మతు పనులను జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోపు సకాలంలో పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి యోహాన్ తెలిపారు. డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో రవీందర్‌తో కలిసి ఆయన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో అవసరమైన పనులను ఎలాంటి వృధా ఖర్చు లేకుండా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. పనుల పురోగతి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఎంఈవో రాజగంగారాం, హెచ్‌ఎంలు, వీవోలు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి




**సుభాష్‌నగర్:** గ్యాస్ డెలివరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకుడు హన్మాండ్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం ఏడోరోజు కొనసాగింది. నగరంలోని శేఖర్ గ్యాస్ ఏజెన్సీ వద్ద వారు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సమస్యలపై యాజమాన్యం, అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్మికుల సమస్యలపై పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌కు మెయిల్ ద్వారా వినతిపత్రం అందజేశామన్నారు. యూనియన్ ప్రతినిధులు గాండ్ల సాయన్న, రవికుమార్, బాల లింగం, శివకుమార్, బబ్లూ, గంగాధర్, రాజు పాల్గొన్నారు.

### దశాబ్ది ఉత్సవాలు గర్వకారణం



**నిజామాబాద్‌నాగారం:** తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది త్సవాలు జరుపుకోవడం గర్వకారణంగా ఉందని కవితరెడ్డి హెల్త్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ కవితరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంతో మంది యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని, వారందరిని స్మరించుకొని నివాళులు అర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అయినా తెలంగాణకు మాత్రం విముక్తి కలగలేదని, గత ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు దొరల పాలనకు చరమగీతం పాడి, గడీల పాలనను బద్దలు కొట్టి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు రాష్ట్రంలో పాలనను సీఎం రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారన్నారు. ఈసందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

### సీఎం సోదరుడిని కలిసిన కాంగ్రెస్ నేతలు



**సిరికొండ:** సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డిని హైదరాబాద్‌లో శనివారం మండల యూత్ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నాయకులు మోతె నవీన్‌రెడ్డి, ఆవుల సతీష్‌లు ఆయనను సన్మానించారు. మండలంలో పార్టీ గురించి చర్చించినట్లు వారు తెలిపారు.

### మజ్జిగ పంపిణీ



**నిజామాబాద్ రూరల్:** నగరంలోని రోకడ్ హనుమాన్ మందిరంలో రోటరీ క్లబ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు పాల్గొని, ప్రజలకు మజ్జిగను అందజేశారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు రామకృష్ణ, విజయరావు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్

**ఖలీల్‌వాడి:** ఎంపీ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ప్రజలు గుంపులుగా ఉండొద్దని సీపీ కల్మేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. డిచ్‌పల్లి మండలంలోని సీఎంసీ కళాశాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రం నుంచి 5 కిలోమీటర్ల పరిధిలో ఎవరూ ఉండొద్దని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# పాంగ్రాలో మౌలిక వసతులు కరువు

- అధ్వానంగా రహదారులు
- రోడ్లపై పారుతున్న మురికినీరు
- ఇబ్బందుల్లో స్థానికులు
- పట్టించుకోని అధికారులు


పాంగ్రా గ్రామంలో కంకర తేలిన రోడ్డు

**నిజామాబాద్ రూరల్:** నగరంలోని 4వ డివిజన్ పాంగ్రా గ్రామంలో ప్రజలకు మౌలిక వసతులు కరువయ్యాయి. గుంతలలమయమైన రహదారులతోపాటు, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు ఎవరూ కూడా పట్టించుకోవడం లేదు.

**ఇదీ పరిస్థితి..**

పాంగ్రాల్లో మురుగు కాలువలు సరిగా లేకపోవడంతో నీరంతా రోడ్డుపైనే పారుతోంది. పలుచోట్ల సీసీ డ్రెయినేజీలు లేక మట్టిలోనే మురికినీరు పారుతోంది. ఈక్రమంలో కాలువల వద్ద పిచ్చిమొక్కలు మొలచి మురుగు నీరు పారకానికి ఆటకం కలిగిస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెందడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అలాగే నిజామాబాద్ నుంచి ప్రాంగా గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా గ్రామంలో అంతర్గత రోడ్లు ఇప్పటికీ మట్టివే ఉండటంతో వర్షాలకు బురదమయంగా మారుతున్నాయి. అంతేకాకుంగా మిషన్ భగీరథ తాగునీరు పైప్‌లైన్ డ్రెయినేజీలోనుంచి నుంచి వేశారు. తరచుగా పైప్‌లైన్ లీకేజీలతో తాగునీరు సరఫరా సక్రమంగా జరగడం లేదు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పాంగ్రా గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

**సౌకర్యాలు కల్పించాలి..**

పాంగ్రా 4వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టిసారించాలి. డివిజన్ పరిధిలో అనేక సమస్యలు నెలకొన్నాయి. ప్రజలకు కావల్సిన మౌలిక వసతులు కరువయ్యాయి. రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదు. దీంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.

–లింగం, మహాలక్ష్మీనగర్ వాసి


రోడ్డుపై పారుతున్న మురికినీరు


డ్రెయినేజీలో ఉన్న మంచినీటి పైప్‌లైన్


అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

## పొలాలకు వెళ్లే రోడ్డు విషయంలో వాగ్వాదం

- దారిని తవ్వేసిన ఓ రైతు

**మోపాల్(నిజామాబాద్‌రూరల్):** మండలంలోని మంచిప్ప గ్రామశివారులోగల పంట పొలాలకు వెళ్లే రోడ్డు విషయంలో ఇద్దరు రైతుల మధ్య వాగ్వాదం నెలకొంది. ఈక్రమంలో కోపోద్రోక్తుడైన ఓ రైతు ఏకంగా 300 ఎకరాల పంట పొలాలకు వెళ్లే రోడ్డును శనివారం తవ్వేశాడు. దీంతో ఆ రోడ్డు గుండా వెళ్లే రైతులంతా గగ్గోలు పెట్టడంతో సమస్యను పరిష్కరించేందుకు వీడీసీ రంగంలోకి దిగింది. వివరాలు ఇలా.. మంచిప్పకు చెందిన బాలు, రవి రైతులు. బాలు తన పొలానికి ఆనుకుని ఉన్న రోడ్డును కబ్జా చేశాడు. దీంతో రవితోపాటు మిగతా రైతులు పొలానికి రావాలంటే వేరే దారి గుండా వెళ్లాల్సి వస్తోంది. ఈక్రమంలో బాలు పొలానికి వెళ్లే సాగునీటి కాల్వను రవి తన పొలం వద్ద నిలిపేశాడు. నీటిని వదలాలని బాలు రవిని కోరగా, పంటపొలానికి వచ్చే దారిని వదలాలని రవి, బాలును కోరాడు. ఈ విషయమై ఎంతకీ సమస్య కొలిక్కి రాకపోవడంతో బాలు కోపంతో పొలాలకు వెళ్లే దారిని తవ్వేశాడు. వీడీసీ ప్రతినిధులు వచ్చి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. బాలును పిలిపించగా, ఆదివారం ఉదయం రోడ్డుపై గుంతను పూడ్చేస్తానని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఈవిషయమై ఎస్సై వివరణ కోరగా, పంచాయతీ కార్యదర్శి ద్వారా ఫిర్యాదు చేయిస్తే కేసు నమోదు చేస్తానని తెలిపారు.


పొలాలకు వెళ్లే దారిని తవ్వేసిన దృశ్యం

### పలువురు ఇంజినీర్లకు ప్రశంసలు!

**నిజామాబాద్‌నాగారం:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం వరంగల్‌లో నిర్వహించనున్న వేడుకల్లో సీఎండీ వరుణ్ రెడ్డి, టీఎస్ఎన్పీడీసీఎల్ కంపెనీ లెవెల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన పలువురు ఇంజినీర్లకు ప్రశంసలు అందజేయనున్నారు. పట్టణ ప్రాంతంలో కంపెనీ స్థాయిలో గంగాశేఖర్ ఏఈ సుభాష్‌నగర్, గ్రామీణ ప్రాంతంలో నాయిని కృష్ణ ఏఈ కోటగిరి, ప్రథమ స్థానంలో నిలిచారు. పట్టణ ప్రాంతంలో ఉత్తమ ఏడీఈగా తోట రాజశేఖర్, ఏడీఈ టౌన్2 నిజామాబాద్ రెండవ స్థానంలో, గ్రామీణ ప్రాంతం సబ్ డివిజన్ సుహాసిని ఏడీఈ నవీపేట్, రవీందర్ రాపల్లి ఆపరేషన్ నిజామాబాద్ మూడో స్థానంలో నిలిచారు. ఈసందర్భంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాల్లో సీఎండీ చేతుల మీదుగా వారికి ప్రశంసలు అందజేయనున్నారు.

# నీటి కుళాయిల లెక్క పక్కాగా!

- నగరంలో ఇంటింటి సర్వే ప్రారంభం!
- ఒక్కో డివిజన్‌కు ప్రత్యేక అధికారులు, సిబ్బంది కేటాయింపు

**నిజామాబాద్‌నాగారం:** నగర మున్సిపల్‌లో నీటి కుళాయిల లెక్క తేల్చేందుకు అధికార యంత్రంగం సిద్ధమైంది. ఈమేరకు ఇంటింటి సర్వేను మున్సిపల్ కమిషనర్ మంద మకరందు రూపొందించారు. ఇందుకోసం ఒక్కో డివిజన్‌కు ప్రత్యేక అధికారులు, సిబ్బందిని కేటాయించారు. ఒక్కో డివిజన్‌కు మున్సిపల్ కార్యాలయం నుంచి ఉద్యోగి ప్రత్యేక అధికారిగా, వీఆర్‌ఏలు అసిస్టెంట్‌లుగా, ఇద్దరు మెప్మా ఆర్పీలు ప్రతినిత్యం నగరంలో ఇంటింటికి తిరిగి వివరాలను సేకరించనున్నారు. నల్ల ఉన్నాదా? ఉంటే గృహాలకు సంబంధించిందా? వ్యాపార సముదాయ కనెక్షనా? అని వారు ఆరా తీయనున్నారు. పూర్తి వివరాలు పక్కాగా నమోదు చేయనున్నారు. వీరిపై ఆయా జోన్‌లకు సంబంధించిన ఏఈ, డీఈలు పర్యవేక్షణ చేయనున్నారు. నగరంలో సుమారు నెల రోజుల పాటు ఈ సర్వే కొనసాగనుంది. అందులోభాగంగా శనివారం పలు ప్రాంతాల్లో పర్యటించి, నల్లా కనెక్షన్లను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరించారు.


నగరంలో పర్యటిస్తూ, వివరాలు సేకరిస్తున్న కమిషనర్ మంద మకరందు

**అక్రమ కనెక్షన్లు తేలేనా?..**

నగర మున్సిపల్ పరిధిలో 60 డివిజన్లు ఉండగా.. సుమారు 85వేలకు పైగా నివాసాలు ఉన్నాయి. అధికారికంగా 25వేల నీటి కుళాయిల కనెక్షన్లు ఉన్నాయి. అనధికారంగా 20వేలకు పైగా ఉన్నట్లు సమాచారం. లబ్ధిదారులకు తెల్లరేషన్‌కార్డు ఉంటే రూ.1తో నల్ల కనెక్షన్లు మున్సిపల్ అధికారులు ఇస్తున్నారు. లేకుంటే సాధారణ కనెక్షన్‌కు రూ. 7వేలు, వ్యాపార వాణిజ్య సంస్థలుంటే రూ. 50వేల నుంచి రూ. 1లక్షా 50వేల ఫీజుతో పాటు అదనపు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కానీ కొంతమంది ఇంజనీరింగ్ సెక్షన్‌లోని సిబ్బంది కొన్నేళ్లుగా గృహాలకు ఇచ్చే అనుమతి కాస్త కమర్షియల్ వాటికి ఇస్తూ తమ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమంగా ఉన్న నీటి కుళాయిల వల్ల నీరు వృథా కావడమే కాకుండా మున్సిపల్‌కు ఆదాయం సమకూరడం లేదు. తద్వారా మున్సిపల్‌కు ప్రతి నెల నష్టం వస్తూనే ఉంది. ఏదేమైనా ప్రస్తుతం చేయనున్న సర్వేతో నీటి కుళాయిల లెక్క పక్కగా తేలనుంది. తద్వారా ప్రతి ఇంటికీ తాగు నీరు అందడంతో పాటు మున్సిపల్‌కు సైతం ఆదాయం సమకూరనుంది.

**సర్వేతో ఇంటింటికీ నల్లా కనెక్షన్..**

నగరంలో సర్వే చేయడం ద్వారా ప్రతి ఇంటికీ నల్ల కనెక్షన్ ఇవ్వడం బాధ్యతగా తీసుకున్నాం. సర్వేతో అక్రమ కనెక్షన్, సక్రమ కనెక్షన్ తెలియనుంది. డివిజన్‌లోని ప్రతి ఇంటికి మున్సిపల్ సిబ్బంది తిరిగి లెక్కలు పక్కగా చేపట్టనున్నారు. తద్వారా అందరికి నీటి కనెక్షన్ ఇవ్వడంతో పాటు మున్సిపల్‌కు ఆదాయం మరింత సమకూరనుంది.

– మంద మకరందు, మున్సిపల్ కమిషనర్

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఘనస్వాగతం



మంత్రి వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

**ఇందల్వాయి/జక్రాన్‌పల్లి:** జిల్లా పర్యాటనకు వచ్చిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి శనివారం ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట పీసీసీ ప్రతినిధి శేఖర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ గౌడ్, నాయకులు మునిపల్లి సాయిరెడ్డి, ముప్ప గంగారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గంగారెడ్డి, దన్లరాజు, రాజేందర్‌రెడ్డి, చింతల కిషన్, చిన్నారెడ్డి, వినోద్ ఉన్నారు.

## కౌంటింగ్ విధులపై అప్రమత్తంగా ఉండాలి

**ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్**

**బోధన్:** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 4న నిర్వహించే ఓట్ల కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు చోటు ఇవ్వకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. పట్టణ కేంద్రంలోని ఆర్డీవో ఆఫీసులో బోధన్ నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులకు కౌంటింగ్ ప్రక్రియపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. డిచ్‌పల్లి మండలంలోని సీఎంసీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌లో జరుగుతుందని, ఓట్ల కౌంటింగ్ నియోజక వర్గానికి సంబంధించి 18 రౌండ్లల్లో ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. తహసీల్దార్ గంగాధర్, అధికారులు తదితరులున్నారు.

## అంతర్జాతీయ క్రీడాకారిణికి నగదు పురస్కారం

**డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్):** అంతర్జాతీయ టెన్నిస్ బాల్ క్రికెట్ క్రీడాకారిణి తమ్మనే మౌనికను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం ఘనంగా సన్మానించి రూ.50 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ధర్పల్లి మండలానికి చెందిన మౌనిక ఇటీవల శ్రీలంక దేశంలో నిర్వహించిన అండర్ -20 ఇంటర్నేషనల్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది. అలాగే, సౌత్ కొరియాలో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ టోర్నీకి మౌనిక ఎంపికైంది. భారత టెన్నిస్ బాల్ క్రికెట్ టీమ్‌కు తెలంగాణ నుంచి ఎంపికైన తొలి క్రీడాకారిణి మౌనిక కావడం విశేషం. కోచ్ లతీఫుద్దీన్‌తో కలిసి బర్ధిపూర్ శివారులోని హోటల్ కృష్ణలో మంత్రి కోమటిరెడ్డిని మౌనిక మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి ఆమెను సన్మానించి నగదును అందజేశారు. ఎంఏ పొలిటికల్ సైన్స్ పూర్తి చేసిన మౌనికకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని ఆమె తల్లి మంత్రిని కోరారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నాయకుడు మనోహర్‌రెడ్డి, డిచ్‌పల్లి సొసైటీ అధ్యక్షుడు రాంచందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారిణి మౌనిక ను సన్మానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

## నేటి చిత్రం..

### డ్రెయినేజీని శుభ్రం చేశారు..

నగరంలోని గోదాం రోడ్డులో గల డ్రెయినేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు శనివారం తొలగించారు. డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకుపోవడంతో సాక్షిలో 'డ్రెయినేజీని శుభ్రం చేయరు' అనే నేటి చిత్రం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి మురికికాలువలోని ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లను తొలగించి, డ్రెయినేజీని శుభ్రం చేయించారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్


గోదాం రోడ్డులోని డ్రెయినేజీ

## సాక్షి ఎఫెక్ట్..

### విద్యుత్ తీగలపై కొమ్మల నరికివేత

**నిజామాబాద్‌నాగారం:** నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉండటంతో విద్యుత్ సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించారు. చెట్ల కొమ్మల్లో విద్యుత్ తీగలు ఉండటంతో సాక్షిలో మే 29న 'చెట్ల కొమ్మల్లో విద్యుత్ తీగలు' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించి గత మూడు రోజులుగా ఆనంద్‌నగర్, సాయినగర్, రోటరీనగర్, న్యాల్‌కల్‌రోడ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మలను నరికివేయిస్తున్నారు. ఏఈ సెలవులో ఉన్నా సిబ్బంది ప్రత్యేక బాధ్యతతో చెట్ల కొమ్మలను తొలగించారు.


నగరంలో విద్యుత్ తీగలపై ఉన్న కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

## ఆధ్యాత్మికం..

### వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు



**డిచ్‌పల్లి:** మండలంలోని నడిపల్లి గ్రామంలో గల ఉమా మహేశ్వర, అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితులు కొల్లావజ్జుల రామ్‌శ్యామ్ శర్మ, శ్రౌతి రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచనము, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ, వీడీసీ, మాజీ సర్పంచ్ కులాచారి సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల పల్లకీ సేవ నిర్వహించారు.

### దాస ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



**నిజామాబాద్‌అర్బన్:** నగరంలోని బొడ్డెమ్మ చెరువు(ఖిల్లా రఘునాథ) కట్టపైన గల దాస ఆంజనేయ స్వామి శివపంచాయతన ఆలయం రెండవ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ చిలుముల భూషన్‌చారి, సభ్యులు మురళి భూపాల్ ,శ్రీనివాస్, జలంధర్, అర్చకులు రాజుశర్మ, నవీన్ ఉన్నారు.

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 73,200 | వెండి (కిలో) | 92,500 |
| 22 క్యారెట్స్ | 67,525 | | |

– నిజామాబాద్ బిజినెస్

### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్స్‌డ్ | 200 |
| | | లైవ్ | 180 |
| స్కిన్‌లెస్ | 240 | మటన్ | 800 |

### కూరగాయల ధరలు(రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 24 | 40 | గాజరుగడ్డ | 30 | 50 |
| బెండకాయ | 20 | 40 | పచ్చిమిర్చి | 50 | 80 |
| జీరకాయ | 40 | 70 | దోసకాయ | 15 | 30 |
| దొండకాయ | 20 | 40 | ఆలుగడ్డ | 25 | 40 |
| బీర్నీసుకాయ | 100 | 120 | గోబిగడ్డ | 20 | 40 |
| కాకరకాయ | 40 | 60 | గోబిపువ్వు | 20 | 40 |
| వంకాయ | 15 | 30 | బీట్‌రూట్ | 20 | 40 |
| పాలకూర | 30 | 50 | కరివేపాకు | 40 | 70 |
| మెంతికూర | 50 | 80 | చామగడ్డ | 40 | 70 |
| కొత్తిమీర | 100 | 130 | గోరుచిక్కుడు | 70 | 100 |
| పుదీనా | 60 | 80 | చిక్కుడుకాయ | 80 | 100 |
| క్యాప్సికం | 40 | 60 | | | |

– సుభాష్‌నగర్

### వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | భజే వాయు వేగం (తెలుగు) - 10.40, గం గం గణేశా (తెలుగు) - 4.30, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు) - 1.30, 7.20, 10.30 |
| స్క్రీన్-2 | గం గం గణేశా (తెలుగు) - 10.45, 1.45, 7.45, భజే వాయు వేగం (తెలుగు) - 4.45, 10.45 |

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | గం గం గణేశా (తెలుగు) - 10.05, 4.10, 7.15, 10.20 |
| స్క్రీన్-2 | భజే వాయు వేగం (తెలుగు)- 1.35, 7.35, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు) - 4.30, 10.30 |
| స్క్రీన్-3 | భజే వాయువేగం (తెలుగు) - 11.10, 10.40, సవి (హిందీ) - 2.05, 7.55 చోటాభీమ్ (హిందీ) - 4.50 |
| స్క్రీన్ -4 | ఫ్యూరియస్ (తెలుగు) - 1.30 లవ్‌మీ (తెలుగు) - 4.45, 10.30 హిట్‌లిస్ట్ (తెలుగు) - 7.40 |
| దేవి | గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు) |
| నటరాజ్ | హిట్‌లిస్ట్ (తెలుగు) |
| విజయ్ | లవ్‌మీ (తెలుగు) |